# నమస్తే తెలంగాణ
# సంగారెడ్డి
I హైదరాబాద్, సోమవారం 29 జూలై 2024 SANGAREDDY


# కాంగ్రెస్‌కు పాలన చేతకాదు



దుబ్బాక మండలం పోతారంలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

- కక్షసాధింపు రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్
- అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్ సర్కారు
- ఏ ఒక్క మంత్రికి శాఖపై అవగాహన లేదు..
- రవాణా శాఖ మంత్రి పొన్నంకు ఆర్టీసీపై అవగాహన లేక ప్రజలకు తిప్పలు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో ఆర్టీసీపై ఒక్కసారి సమీక్షా నిర్వహించని మంత్రి పొన్నం
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, జూలై 28: కాంగ్రెస్‌కు పాలన చేతకాదని, దేశంలో అత్యంత దౌర్భగ్యమైన సర్కారు ఏదైనా ఉందంటే అది తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వమేనని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం దుబ్బాక మండలం పోతారంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమం విస్మరించి కక్షసాధింపు రాజకీయాలు చేస్తున్నదని మండిపడ్డారు. మంత్రులకు తమ శాఖలపై కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్‌పై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారని, హామీలు విస్మరించారని విమర్శించారు. నిధులు లేక గ్రామాల్లో పారిశుధ్యం లోపించిందని, ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆర్టీసీపై కనీసం అవగాహన లేదని, కాలం చెల్లిన బస్సులతో అటు సిబ్బంది, ఇటు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బస్‌లు, సిబ్బంది కొరతతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం సంతోషకరమే కానీ, సరిపడా బస్‌లు లేక విద్యార్థులు, వృద్ధులు ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బస్ రూట్‌లు, బస్‌ల ఏర్పాటుపై మంత్రి పొన్నంకు కనీస అవగాహన లేదన్నారు. ఆయన హుస్నాబాద్‌కే మంత్రిగా వ్యవహరించడం తప్ప రాష్ట్రమంత్రి అనే విషయాన్ని మరిచి పోయాడని ఎద్దేవా చేశారు.ఇప్పటి వరకు ఉమ్మడి మెదక్ జిల్లాలో ఆయన ఆర్టీసీపై సమీక్షా సమావేశం నిర్వహించలేదని విమర్శించారు. ఎమ్మెల్యేగా తాను ఇరిగేషన్ మంత్రికి పలుమార్లు మల్లన్నసాగర్ గురించి విన్నవించినా పట్టించుకోలేదని, సాగునీటి సమస్యతో రైతులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోలేని పరిస్థితిలో మంత్రులు ఉండడం బాధాకరం అన్నారు. కాంగ్రెస్ పాలన అంటే కష్టాలకు కేరాఫ్‌గా మారిందని ఎమ్మెలే కొత్త ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. కార్యక్రమంలో దుబ్బాక మాజీ జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు ఎల్లారెడ్డి, కిషన్‌రెడ్డి,నారాగౌడ్, శ్రీనివాస్, స్వామి, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

# కొమురవెల్లి ఆలయ ఏఈవో సస్పెన్షన్

చేర్యాల, జూలై 28: కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ ఏఈవో గంగా శ్రీనివాస్‌ను ఆదివారం సస్పెన్షన్ చేసినట్లు ఈవో బాలాజీ ఆదివారం తెలిపారు. స్వామి వారి దర్శనాల పాసుల జారీ, హుండీ లెక్కింపు సందర్భంగా బాధ్యతారహితంగా వ్యహరించడం, వివిధ ఆరోపణ నేపథ్యంలో సదరు అధికారిని సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. ఆలయంలో పనిచేసే అధికారులు, సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు. సస్పెన్షన్ విషయమై ఏఈవో గంగా శ్రీనివాస్ విలేకరులతో ఫోన్‌లో మాట్లాడుతూ.. తనపై వస్తున్న అరోపణలో ఎలాంటి వాస్తవం లేదని, ఈవో ఆదేశాల మేరకు తాను దర్శనాల పాసులు జారీ చేశానని తెలిపారు. హుండీ లెక్కింపులో తాను తప్పు చేస్తే ఏశిక్షకైనా సిద్ధమని, తనపై జరుగుతున్న అసత్య ప్రచారాలపై కోర్టుతో పాటు ఉన్నతాధికారులను ఆశ్రయించనున్నట్లు తెలిపారు.

# 30న రెండో విడత రుణమాఫీ విడుదల

**మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్**

మెదక్ మున్సిపాలిటీ, జూలై 28 : రైతు రుణమాఫీ రెండో విడత నిధులను ప్రభుత్వం ఈనెల 30న ఉదయం 11గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ప్రాంగణంలో విడుదల చేస్తారని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజా ప్రతినిదులు, రైతులు, అధికారుల సమక్షంలో రుణమాఫీ చేపట్టనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ, సహకార శాఖ, బ్యాంకు అధికారులు పాల్గొంటారని తెలిపారు.



సింగూరు ప్రాజెక్టు

# సింగూరుకు 3,377 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

పుల్కల్, జూలై 28: సంగారెడ్డి జిల్లా సింగూరు ప్రాజెక్టుకు ఆదివారం 3,377 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వచ్చినట్లు ప్రాజెక్టు ఏఈ మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా,ప్రస్తుతం ప్రాజెక్టులో 14.324 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. ఔట్‌ఫ్లో 391 క్యూసెక్కులు కొనసాగుతున్నట్లు తెలిపారు. ఎగువన కర్ణాటక, మహారాష్ట్రలో వర్షాలు కురుస్తుండడంతో ప్రాజెక్టులోకి వరద వస్తున్నదని తెలిపారు. ప్రాజెక్టు మీటర్లు 523.600 ఎత్తుకు, ప్రస్తుతం 519.800 మీటర్లలో నీరు ఉంది. తాలెల్మ ఎత్తిపోతల పథకానికి 41 క్యూసెక్కులు, హెచ్‌ఎండబ్ల్యూఎస్‌కు 80 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 70 క్యూసెక్కులు, 200 క్యూసెక్కులు వృథాగా దిగువకు వెళ్తున్నట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపారు.

# గజ్వేల్‌లో రెండు రోజులే ఆర్టీఏ సేవలు



గజ్వేల్‌లోని తాత్కాలిక ఆర్టీఏ కార్యాలయం

- లైసెన్స్, వాహనాల రిజిస్ట్రేషన్ల సేవలకే పరిమితం
- వాహనాల ట్రాన్స్‌ఫర్‌కు సిద్దిపేటకు వెళ్లాల్సిందే
- పూర్తిస్థాయి సేవలకు వాహనదారుల ఎదురుచూపు

గజ్వేల్, జూన్ 28: గజ్వేల్‌లో వాహనదారులకు ఆర్టీఏ అధికారుల సేవలు రెండు రోజులకే పరిమితమయ్యాయి. వారంలో మంగళ, శుక్రవారాల్లో గజ్వేల్‌లో ఎంవీఐ అందుబాటులో ఉంటున్నారు. మిగతా రోజుల్లో వాహనదారులకు ఎలాంటి పనులున్నా సిద్దిపేటలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయానికి వెళ్లాల్సి వస్తున్నది. డివిజన్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఎంవీఐ కార్యాలయాల్లో పూర్తిస్థాయి సేవలు అందుబాటులోకి రాకపోవడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు రోజులే ఎంవీఐలు అందుబాటులో ఉండడంతో వాహనాల రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్ లైసెన్స్‌లు, మిగతా సేవలకు సిద్దిపేటకు వెళ్లాల్సి వస్తుండడం వాహనదారులకు ఇబ్బందిగా మారింది. సిద్దిపేటలోని ఆర్టీఏ కార్యాలయానికి వెళ్తే రోజంతా అక్కడే గడిచిపోతున్నదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గజ్వేల్‌లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కార్యాలయంలో కొత్త లైసెన్స్‌లు, లైసెన్స్‌ల రెన్యువల్, వాహనాల రిజిస్ట్రేషన్ల సేవలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మిగతా సేవలకు సిద్దిపేటకు వెళ్లాల్సి వస్తున్నది. గజ్వేల్ డివిజన్ కేంద్రంలో పూర్తిస్థాయిలో సేవలు అందుబాటులోకి వస్తే గజ్వేల్, జగదేవ్‌పూర్, వర్గల్, ములుగు, మర్కూక్, రాయపోల్, దౌల్తాబాద్ మండలాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. గజ్వేల్ డివిజన్ కేంద్రంలోనే కాదు హుస్నాబాద్, చేర్యాలలో ఇదే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా డివిజన్ కేంద్రాల్లో శాశ్వత కార్యాలయాలు ఏర్పాట్లు చేసి పూర్తిస్థాయిలో సేవలు అందిస్తే వాహనదారులతో పాటు ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..**

సిబ్బంది కొరత కారణంగా ఆర్టీఏ సేవలను రెండు రోజుల పాటే అందిస్తున్నాం. గజ్వేల్‌లో వారంలో రెండు రోజుల పాటే ఆర్టీఏ సేవలు అందుతుండడంతో వాహనదారులు పడుతున్న ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

–క్రిస్టోఫర్, ఎంవీఐ గజ్వేల్



ఇటీవల అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా సిద్దిపేట జిల్లా దుద్దెడ వద్ద బోల్తాపడిన డీసీఎం, అందులోని రేషన్ బియ్యం బస్తాలు

# 'రేషన్' పక్కదారి !



- ఉమ్మడి మెదక్ జిల్లాలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా
- గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యేక వాహనాల ద్వారా సేకరణ
- సేకరించిన బియ్యం రైస్‌మిల్లులకు తరలింపు
- ఈ దందాలో పలువురు రేషన్‌డీలర్ల పాత్ర
- మామూళ్ల మత్తులో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- ఇతర జిల్లాలు, పక్క రాష్ట్రాలకు తరలింపు

సిద్దిపేట, జూలై 28(నమస్తే తెలంగాణ ప్రతినిధి): పేదల ఆహార భద్రత కోసం ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నది. కొంతమంది వ్యాపారులు రేషన్ బియంతో దందా చేస్తూ భారీగా సంపాదిస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో పేదల బియ్యంతో కోట్ల రూపాయల దందా సాగుతున్నది. లబ్ధిదారులు రేషన్ బియ్యం తీసుకొని పోయిన తర్వాత వారి ఇండ్ల వద్ద ప్రత్యేక వాహనాల ద్వారా సేకరిస్తున్నారు. మరికొన్ని చోట్ల రేషన్ డీలర్లు వేలి ముద్రలు పెట్టించుకొని లబ్ధిదారులకు తక్కువ ధరతో డబ్బులు చెల్లించి రెట్టింపు ధరలకు రాత్రి సమయంలో ఆ బియ్యాన్ని రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల పరిధిలో రేషన్ బియ్యం దందా మూడు పూలు ఆరు కాయలుగా కొనసాగుతోంది. పౌరసరఫరాలశాఖ, రెవెన్యూశాఖలోని కొంతమంది అధికారులు రైస్ మిల్లర్లతో చేయి కలిపి ఈ దందాకు సహకరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పేరుకు టాస్క్‌ఫోర్స్‌లు ఏర్పాటు చేశామని చెప్పి ఒకటి రెండు చోట్ల దాడులు చేయడం...ఆ తర్వాత విస్మరించడం పరిపాటిగా మారింది. దాడులకు వెళ్లే ముందు కొంతమంది సిబ్బంది ముందస్తుగానే సమాచారం ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**ఒక వ్యక్తికి ఆరు కిలోలు**

ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ఒక వ్యక్తికి ఆరు కిలోల చొప్పున ప్రభుత్వం ఉచితంగా బియ్యం అందజేస్తున్నది. సిద్దిపేట జిల్లాలో ప్రతి నెలా 2,91,400 కుటుంబాలకు 684 రేషన్‌షాపుల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారు. ఆహార భద్రత కార్డు ద్వారా కుటుంబంలోని సభ్యుల సంఖ్యతో సంబంధం లేకుండా ఒక్కొక్కరికి ఆరు కిలోలు, అంత్యోదయ కార్డుదారులకు 35కిలోల చొప్పున బియ్యం అందిస్తున్నారు. మెదక్ జిల్లాలో 520 రేషన్‌షాపుల ద్వారా 2,13,855 కార్డుదారులకు, సంగారెడ్డి జిల్లాలో 846 రేషన్ షాపుల ద్వారా 3,81,375 ఆహార భద్రత కార్డుల ద్వారా బియ్యాన్ని అందిస్తున్నది. లబ్ధిదారుల్లో చాలామంది ఆర్థిక స్థోమత ఉన్నవారే ఉన్నారు. వారితోపాటు కొందరు పేదలు కూడా రేషన్‌షాపులో ఇచ్చే దొడ్డు బియ్యం తినకుండా విక్రయిస్తున్నారు. దీన్ని గ్రామాలు, పట్టణాల్లోని రేషన్ డీలర్లు తమ దుకాణాల్లో బియ్యం తీసుకునేందుకు వచ్చిన వినియోగదారుల కార్డునంబర్ ఈ-పాస్ మిషన్‌లో నమోదు చేస్తున్నారు. కార్డులోని లబ్ధిదారుల సంఖ్యకు అనుగుణంగా ఏమేరకు బియ్యం ఇవ్వాలో చూసి కిలోకు గ్రామాల్లో రూ. 10 నుంచి రూ. 12, పట్టణాల్లో రూ. 15 నుంచి రూ. 18 వరకు ఇస్తున్నారు. ఇలా లబ్ధిదారులు బియ్యం కాకుండా డబ్బులు తీసుకుపోతున్నారు. ప్రతినెలా రేషన్ షాపుల్లో మిగిలిన బియ్యాన్ని బస్తాల్లో నింపి రాత్రివేళల్లో గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు. గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి మరికొంత మంది వ్యాపారులు ఆటోల్లో సేకరించి సిద్దిపేట, హుస్నాబాద్, చేర్యాల, దుబ్బాక, రామాయంపేట, మెదక్, నర్సాపూర్ తదితర ప్రాంతాల్లో ఉన్న రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణ్‌ఖేడ్, ఆందోల్ తదితర ప్రాంతాల నుంచి లారీల్లో పక్క రాష్ట్రాలకు చీకటి వేళల్లో తరలిస్తున్నారు. చెక్‌పోస్టుల్లో అధికారులకు మామూళ్లు ఇచ్చి దర్జాగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇదంతా సంబంధిత అధికారులకు తెలిసి జరుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. జహీరాబాద్ చెక్‌పోస్టు కేంద్రంగా రోజూ రేషన్ బియ్యం లారీలు తరలుతున్నా అక్కడ ఏమాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పేరుకే చెక్‌పోస్టు కానీ అక్కడ మామూళ్లతోనే పనులు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలోని పలు రైస్ మిల్లులకు తరలించిన రేషన్ బియ్యాన్ని సీఎంఆర్ కింద ప్రభుత్వానికి అందిస్తూ భారీ మొత్తంలో రైస్ మిల్లర్లు సొమ్ము చేసుకుంటున్నారు. లబ్ధిదారుల నుంచి సేకరించిన బియ్యాన్ని వచ్చే నెల మళ్లీ రేషన్ షాపులకు పంపిణీ చేస్తున్నారు. ఇలా ప్రతి నెలా జరుగుతూనే ఉన్నది. అధికారులకు ఈ విషయం తెలిసి కూడా పట్టించుకోవడం లేదు. ఇటీవల సిద్దిపేట జిల్లా దుద్దెడ స్టేజీ వద్ద రేషన్ బియ్యం తరలిస్తున్న లారీ బోల్తాపడగా అం దులోని బియ్యం బస్తాలు పీడీఎస్ రైస్ అని తెలింది. ఆ బియ్యాన్ని సిరిసిల్ల జిల్లా జిల్లెల్ల నుంచి వికారాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్నారు. తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్మడానికి అక్రమ రవాణా చేస్తు న్న విషయం బయటపడింది. ఆ లారీలో 140 క్విం టాళ్ల బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు, స్థానిక పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేశారు. జహీరాబాద్ చెక్‌పోస్టుతోపాటు ఇటీవల చిన్నకోడూరు, సిద్దిపేట రూరల్ మండలంలో పెద్దమొత్తంలో బియ్యాన్ని పట్టుకున్నారు.

**ఉమ్మడి మెదక్ జిల్లాలో రేషన్ షాపులు, కార్డుదారుల వివరాలు**

| జిల్లా | రేషన్ షాపులు | కుటుంబాలు |
|---|---|---|
| సిద్దిపేట | 684 | 2,91,400 |
| మెదక్ | 520 | 2,13,855 |
| సంగారెడ్డి | 846 | 3,81,375 |
| మొత్తం | 2,050 | 8,86,630 |

# ఉత్సాహంగా హాఫ్ మారథాన్



సిద్దిపేట హాఫ్ మారథాన్‌లో పాల్గొన్న రన్నర్స్

- రంగనాయక సాగర్‌పై అథ్లెట్ల సందడి
- హాజరైన ఎంపీ రఘునందన్, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

సిద్దిపేట, జూలై 28: జిల్లాలోని రంగనాయక సాగర్‌పై ఆదివారం సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన హాఫ్ మారథాన్ రెండో ఎడిషన్ పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. మెదక్ ఎంపీ రఘునందన్, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, సిద్దిపేట ఏసీపీ మధు ఈ మారథాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఆరోగ్యకర జీవన విధానానికి ప్రతి ఒక్కరూ నడకను అలవాటు చేసుకోవాలన్నారు.

వ్యాయామం ద్వారా రోగాలకు దూరంగా ఉండవచ్చన్నా రు. ఈ పోటీల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొనడం, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నిర్వహించడంపై అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ మారథాన్ లో 3000 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమా లు అలరించాయి. సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ప్రతినిధులు బాపురెడ్డి, రన్నర్స్ నిరంజన్, వెంకటేశ్, జనగామ సీఐ రఘుపతి రెడ్డి, హరి, చారి, సురేశ్, శ్రీనివాస్, రవి, నర్సింహులు, వేణు తదితరులు పాల్గొన్నారు.

**రెండో ఎడిషన్ విజేతలు వీరే...**

రంగనాయక సాగర్‌పై నిర్వహించిన హాఫ్ మారథాన్ రెండో ఎడిషన్ 5,10,21 కిలోమీటర్ల విభాగం పోటీల్లో 21 కిలోమీటర్ల పురుషుల విభాగంలో యోగేందర్‌యాదవ్, రమావత్ రమేశ్‌చంద్ర, సోనుకుష్వా, మహిళల విభాగంలో మరుపల్లి ఉమ, వడ్డే నవ్య, మద్దూరి కావ్య విజేతలుగా నిలిచారు. 10 కిలోమీటర్ల పరుగు పందెం పురుషుల విభాగంలో పంకజ్ సింగ్, సునీల్‌కుమార్, మహేశ్‌కుమార్, మహిళల విభాగంలో మహేశ్వరి, కొడావత్ స్వప్న, రాజేశ్వరి వరుసగా మూడు స్థానాల్లో నిలిచారు. ఐదు కిలోమీటర్ల పురుషుల విభాగంలో చంద్రశేఖర్, సామ్యూల్, ఈశ్వర్లు తొలి మూడు స్థానాల్లో నిలిచారు.




సిద్దిపేట హాఫ్ మారథాన్ విజేతలకు మెడల్స్ అందజేస్తున్న ఎంపీ రఘునందన్, నిర్వాహకులు



# కంపు కంపు..

సంగారెడ్డి పట్టణంలోని రాజీవ్ స్వగృహ సముదాయాల పరిసరాల్లో అపరిశుభ్రత తాండవిస్తున్నది. భారీగా చెత్తాచెదారం పేరుకుపోయింది. మురుగు నిలిచి పరిసరాలు కంపుకొడుతున్నాయి. పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. దోమలు విజృంభిస్తున్నాయి. రాజీవ్ స్వగృహ ఇండ్లలో నివసిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇటువైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పరిసరాలను శుభ్రం చేయాలని కోరుతున్నారు.

– సంగారెడ్డి ఫొటోగ్రాఫర్, జూలై 28







నర్సాపూర్ చౌరస్తాలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న రైతులు

# సెమీ అర్బన్ ప్రాంతంగా అభివృద్ధి చేయాలి

నర్సాపూర్, జూలై 28: కొండపోచమ్మ కాలువ నిర్మాణం రద్దు చేయాలంటూ రైతులు చేస్తున్న రిలే నిరాహార దీక్ష ఆదివారం 17వ రోజుకు చేరుకుంది. మండలంలోని చిన్న చింతకుంట, బ్రాహ్మణపల్లి, శివంపేట్ మండలం చెన్నాపూర్ గ్రామాల రైతులు ఆదివారం దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ..కొండపోచమ్మ కాలువ వద్దని, ఈ ప్రాంతాన్ని సెమీ అర్బన్‌గా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో రైతులు నరసింహారెడ్డి, మహేశ్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, నిశాంత్‌రెడ్డి, ప్రభాకర్, దత్తాత్రేయ, రాజమౌళి, నగేశ్‌గౌడ్, శ్రీశైలంయాదవ్, హన్మంత్ గౌడ్, ప్రేమ్‌చరణ్ తదితరులు పాల్గొన్నారు.







# నాడు జలకళ .. నేడు వెలవెల

సిద్దిపేట జిల్లా మర్కూక్‌లో బీఆర్‌ఎస్ సర్కారు నిర్మించిన కొండపోచమ్మ సాగర్ ప్రస్తుతం నీళ్లులేక వెలవెలబోతున్నది. రిజర్వాయర్ సామర్థ్యం 15 టీఎంసీలు కాగా, దీని నుంచి నాలుగు జిల్లాలకు సాగు,తాగు అందించేలా ఈ రిజర్వాయర్‌ను కేసీఆర్ నిర్మించారు. బీఆర్‌ఎస్ హయాంలో ఈ రిజర్వాయర్ జలాలతో కళకళలాడేది. కాల్వల ద్వారా మెదక్, సంగారెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లాలకు నీరందించారు. దీంతో అన్ని చెరువులు నిండి సాగుకు నీరందింది. రైతులు సంతోషంతో రెండు పంటలు పండించుకున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు నింపకపోవడంతో కొండపోచమ్మ సాగర్ నీళ్లు లేక వెలవెలబోతున్నది. దీంతో ఆయకట్టు రైతులు సాగుకు ఆందోళన చెందుతున్నారు.

– మర్కూక్, జూలై 28